క్లుప్తంగా

నేడు నిరాహార దీక్ష

ఎడపల్లి(బోధన్): మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్‌ను పునరుద్ధరించాలని కోరుతూ గ్రామ పంచాయతీ ఎదుట సోమవారం నిరాహార దీక్ష చేపట్టనున్నట్టు రైతు సంఘం నాయకుడు గుమ్ముల గంగాధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీలకు అతీతంగా దీక్షలో పాల్గొని విజయవంతం చేయాలని అఖిల భారత ప్రగతిశీల రైతుసంఘం తరఫున కోరుతున్నట్లు పేర్కొన్నారు.

నేడు ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్టపై ఉన్న శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆలయ పరిసర ప్రాంతాల్లో ఊరేగిస్తామన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



కమ్మర్‌పల్లి: మండలంలోని గాంధీనగర్‌కు చెందిన పల్లపులక్ష్మి ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని కుటుంబానికి కాంగ్రెస్ నాయకులు ఆదివారం పరామర్శించారు. రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ముత్యాల సునీల్‌రెడ్డి, వేముల చిన్న గంగారెడ్డి రూ.5 వేల చొప్పున అందజేయగా, నాయకులు బాధిత కుటుంబానికి అప్పగించారు.

వృద్ధులు, దివ్యాంగులకు చేయూత



నిజామాబాద్‌నాగారం: నగరంలోని ముబారక్ నగర్ ప్రాంతానికి చెందిన రమణరెడ్డి, లక్ష్మీదేవిల కూతురు మాధవరెడ్డి పుట్టిన రోజున సందర్భంగా ఆదివారం స్నేహసొసైటీలో వృద్ధులు, దివ్యాంగులకు రూ.25వేల ఆర్థిక సహాయం చేశారు. తమ కుమార్తె తొమ్మిదేళ్ల క్రితం మృతిచెందగా, ఆమె ఆత్మ శాంతి చేకూరాలని సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తండ్రి రమణరెడ్డి, తల్లి లక్ష్మీదేవి, మేనత్త సుబ్బలక్ష్మి తెలిపారు. స్నేహ సొసైటీ నిర్వాహకులు సిద్దయ్య, ప్రిన్సిపాల్ జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరి, స్నేహ సొసైటీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు..

ఎస్సైని కలిసిన కాంగ్రెస్ నేతలు



సిరికొండ: మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్సై రమేష్‌ను మండలానికి కాంగ్రెస్ నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్సైకి శాలువా కప్పి సన్మానం చేశారు. పార్టీ నాయకులు బాకారం రవి, రాజేశ్వర్‌గౌడ్, రాంరెడ్డి, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు



ఖలీల్‌వాడి: జిల్లా ప్రజలకు, కాంగ్రెస్ శ్రేణులకు, డీసీసీ అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరం శాంతి, సంపద, ఆరోగ్యాన్ని కలిగిస్తుందని ఆశిస్తూ, కొత్త ఆశలకు ఊపిరి పోసుకోవాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మీ అందరి సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకువెళ్దామని ఆకాంక్షించారు.

గురుస్వామి మనోహర్‌రెడ్డికి సన్మానం



నిజామాబాద్ సిటీ: నగరంలోని అయ్యప్ప ఆలయంలో గురుస్వామి మనోహర్‌రెడ్డిని ఆదివారం అయ్యప్పమాలధారులు సన్మానించారు. ఈసందర్భంగా స్వాములు మాట్లాడుతూ.. గురుస్వామి గత 32 సంవత్సరాలుగా అయ్యప్ప మాల దీక్ష వేసుకోవడంతోపాటు, అయ్యప్ప స్వాములకు చేస్తున్న సేవలను దృష్టిలో ఉంచుకుని సన్మానించినట్లు తెలిపారు.

కొండల్లో నెలకొన్న రంగనాథుడు

- కోరిన కోర్కెలు తీర్చే దైవంగా ప్రసిద్ధి
- శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ అంచున స్వయంభూగా వెలిసిన స్వామి
- జలాల్‌పూర్ వాసుల కొంగుబంగారం



రంగనాథ స్వామి ఆలయ ముఖద్వారం.. కొండపై రంగనాథుని ఆలయం

బాల్కొండ: మండలంలోని జలాల్‌పూర్ గ్రామ శివారులోని శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ నిలువ ఉండే ప్రాంతంలోని కొండల్లో నెలకొన్న రంగనాథుడు కోరిన కోర్కెలు తీర్చే దైవంగా ప్రసిద్ధి. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో ముంపునకు గురైన జలాల్‌పూర్ గ్రామ కొండపై గుహలో 300 సంవత్సరాల క్రితం రంగనాథ స్వామి స్వయంభూగా వెలిసినట్లు పూర్వీకులు చెబుతారు. ప్రకృతి ఒడిలో ఓ వైపు గంగమ్మ, మరో వైపు చెరువ కొండ ప్రాంతం గుహలో ఆహ్లాదకరమైన వాతావరణంలో వెలిసిన రంగనాథుడు కోరిన కోర్కెలు తీర్చే దైవంగా నిత్య పూజలు అందుకుంటున్నాడు.

ఆలయ చరిత్ర..

ముంపునకు గురైన గ్రామ శివారులో పెద్ద కొండ ప్రాంతం ఉంది. శ్రీరాముడు రావణుడిని సంహరించిన తరువాత బ్రహ్మహత్య పాపం తొలిగిపోయేందుకు దక్షిణ అభిముఖంగా ప్రవహించే గోదావరికి బయల్దేరినప్పుడు ఈ కొండ ప్రాంతంలో సేద తీరుతాడు. ఆ సమయంలో విభీషణుడు శ్రీరాముడిని నిత్యం మీరు ఆరాధించే దైవం రూపాన్ని కనులారా చూడాలని ఉందని కోరుతాడు. దీంతో వీభీషణుడు కోరిక మేరకు శ్రీరాముడు భక్తితో వేడుకోగా రంగనాథుడు ఈ కొండలో వెలిసి దర్శనమిచ్చినట్లు ఆలయ పూజారులు తెలుపుతున్నారు.

ఎల్లప్పుడూ ఉత్తర ద్వార దర్శనమే..

ముక్కోటి ఏకాదశి రోజున వైష్ణవ ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేస్తారు. కానీ ఇక్కడి రంగనాథ స్వామి ఎల్లప్పుడూ భక్తులకు ఉత్తర ద్వారం ద్వారానే దర్శనమిస్తారు. స్వామి వెలిసిన గుహలోనికి ఒక్కొక్కరు మాత్రమే వెళ్లాల్సి ఉంటుంది. ఆలయ ప్రాంగణంలోని చెట్టుపై నుంచి పూలను కోసి స్వామి మూర్తిపై వేస్తే, ఒక్క పువ్వయినా అయిన స్వామి మూర్తి పై నిలబడితే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల నమ్మకం.

ఘనంగా ఉత్సవాలు..

శ్రీరంగనాథ స్వామి ఉత్సవాలను ప్రతి ఏడాది ఉగాది, వైకుంఠ ఏకాదశి, మకర సంక్రాంతి సందర్భంగా ఘనంగా నిర్వహిస్తారు. గోదాదేవి, రంగనాథుల కల్యాణం వైభవంగా నిర్వహిస్తారు. ప్రతి నెల రెండో శనివారం ఆలయంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తారు. గ్రామానికి దూరంగా ఆలయం ఉన్నప్పటికీ నిత్యం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది.



కొండగుహలో రంగనాథుడు



రంగనాథుడు వెలిసిన కొండ గుహ

నిత్య పూజలు ఉంటాయి



రంగనాథ స్వామి ఆలయంలో నిత్య పూజలు ఉంటాయి. ప్రతి రోజూ స్వామివారికి దద్దోజనం ప్రసాదం ఉంటుంది. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు స్వామి దర్శనానికి వస్తుంటారు.

– వేణుగోపాల్, ఆలయ పూజారి

కోరిన కోర్కెలు నెరవేరుతాయి



జలాల్‌పూర్‌లో వెలిసిన స్వయంభూ రంగనాథ స్వామి కోరిన కోర్కెలు తీర్చే దైవంగా ప్రసిద్ధి చెందాడు. భక్తితో పూజలు చేస్తే అనేక మంది భక్తుల కోర్కెలు తీరాయి. ప్రతి శనివారం ఆలయానికి వచ్చి పూజలు చేస్తుంటాం. – మోహన్‌రెడ్డి, గ్రామస్తుడు

ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తాం



ఆలయం వద్ద ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తాం. మకర సంక్రాంతికి గోదాదేవి రంగనాథుల కల్యాణోత్సవం వైభవంగా చేస్తాం. ప్రతినెలా రెండో శనివారం అన్నదానం ఉంటుంది. – కిషన్‌గౌడ్, ఆలయ కమిటీ సభ్యుడు

నేడు సంతమల్లన్న జాతర

- అంక్సాపూర్ వీడీసీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి



జాతరకు ముస్తాబైన సంతమల్లన్న దేవాలయం

వేల్పూర్: మండలంలోని అంక్సాపూర్‌లో సంతమల్లన్న జాతరను సోమవారం ఘనంగా నిర్వహించనున్నారు. వీడీసీ ఆధ్వర్యంలో ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేశారు. గ్రామానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న సంతమల్లన్నగుట్టపై నిర్మించిన ఆలయం ఆవరణలో జాతర, రథోత్సవం జరుగనుంది. భీమ్‌గల్ లింబాద్రిగుట్ట జాతర తర్వాత రెండో అతిపెద్ద జాతరగా సంతమల్లన్న జాతర ప్రసిద్ధి చెందింది. గ్రామస్తులకు ఏడాదిలో ఎన్ని పండుగలు వచ్చినా సంతమల్లన్న జాతరతోనే తమ తొలి ఏడాదిని ప్రారంభిస్తారు. సంతమల్లన్న దీవెనతోనే తామంతా సుఖసంతోషాలతో ఉంటామని ఇక్కడి వారి నమ్మకం. ఇందుకోసం నెల రోజుల ముందునుంచే మద్యం, మాంసం మానేసి ఇంటిల్లిపాది నియమనిష్టలతో ఉంటారు. కోరికలు తీర్చే దేవుడుగా కొలుస్తూ గ్రామస్తులే కాకుండా ఆర్మూర్ డివిజన్‌లోని ఆయా మండలాల ప్రజలు, ఇతర జిల్లాల భక్తులు ఏడాదిపొడువునా సంతమల్లన్నను దర్శించుకుంటూ ఆరాధ్యదైవంగా పూజిస్తారు. వారం రోజులనుంచి ఉత్సవాలను ప్రారంభించారు. గ్రామంలో రాత్రిపూట శోభాయాత్ర నిర్వహించారు. గ్రామం నుంచి కాలినడకన తడ్‌పాకలకు చేరుకొని గోదావరి నదిలో సంతమల్లన్న విగ్రహాలకు శనివారం గంగస్నానం చేయించారు. ఆదివారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి పూలతో రథాన్ని సిద్ధం చేశారు. సాయంత్రం డప్పు వాయిద్యాలతో రథాన్ని గ్రామం నుంచి సంతమల్లన్న గుట్టకు తీసుకెళ్లారు. సోమవారం జాతర, రథోత్సవం, మంగళవారం నైవేద్యాలు సమర్పణ, అగ్నిగుండం, జాతర కార్యక్రమాలు ముగుస్తాయి. జాతరకు వచ్చే భక్తుల కోసం గుట్టపై సత్రాలు, నీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. గ్రామం నుంచి గుట్టవరకు తారురోడ్డు, గుట్ట చుట్టూ గిరిప్రదక్షిణ కోసం సీసీ రోడ్డు నిర్మించారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకో కుండా వేల్పూర్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

బషీరాబాద్‌లో జాతర



పుట్టమన్ను తెస్తున్న గ్రామస్తులు

కమ్మర్‌పల్లి: మండలంలోని బషీరాబాద్‌లో మల్లన్న స్వామి జాతర ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గంగనీళ్లు, పుట్టమన్ను తీసుకువచ్చారు. సోమవారం మల్లన్నస్వామి బోనాల ఊరేగింపు, మల్లన్న గొల్ల కేతమ్మ బలిజ మేడలమ్మ కల్యాణం, అన్నదానం నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. జాతర ఉత్సవాల్లో పాల్గొని మల్లన్నస్వామి కృపకుపాత్రులు కావాలని కోరారు.

ఆలూర్‌లో రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండల కేంద్రంలో వీడీసీ ఆధ్వర్యంలో కండె రాయుడు మల్లన్న స్వామి జాతరను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలూర్‌తోపాటు పరిసర గ్రామాల ప్రజలు మల్లన్న స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వీడీసీ ఆధ్వర్యంలో రథోత్సవం కన్నుల పండువగా సాగింది. వీడీసీ అధ్యక్షుడు నలిమెల మోహన్ రెడ్డి, సర్పంచ్ కళ్లెం మోహన్‌రెడ్డి, ఉప సర్పంచ్ దుమ్మాజి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారం మానుకోవాలి



భీమ్‌గల్‌లో మాట్లాడుతున్న బొదిరె స్వామి



వేల్పూర్‌లో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

భీమ్‌గల్: ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డితోపాటు ఆయన అనుచరులు కాంగ్రెస్ ప్రభుత్వంపై, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డిపై అసత్య ప్రచారం చేయడం మానుకోవాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొదిరె స్వామి అన్నారు. పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నకిలీ ప్రొసిడింగ్‌లు ఇచ్చి, మభ్యపెట్టి ఓట్లు దండుకున్న విషయం ప్రజలకు అర్థమైందన్నారు. ఈ విషయమై మిమ్మల్ని ఎక్కడ నిలదీస్తారోననే భయంతో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై అసత్య ప్రచారం చేస్తూ ప్రశాంత్‌రెడ్డి కాలం గడిపేయాలనుకుంటున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రశాంత్‌రెడ్డి అనుచరులు నియోజకవర్గంలో చేస్తున్న అక్రమ భూదందాలు, ఇసుక, మొరం అక్రమ తవ్వకాలను మానుకోవాలని, ప్రజలను భయభ్రాంతులకు గురిచేయొద్దని హెచ్చరించారు. పల్లె శేఖర్, నల్లూరి శీను, కుర్తిలాల్, సేవాలాల్, రాజారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

పనులు పూర్తి చేయాల్సిన బాధ్యత మీదే..

వేల్పూర్: ఎన్నికలకు ముందు బీఆర్‌ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన పనులను పూర్తి చేయాల్సి బాధ్యత వారిదేనని, లేకుంటే ఎక్కడికక్కడ నిలదీస్తామని వేల్పూర్ మండల కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి దామోదర్‌గౌడ్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు స్వరూప, మైనారిటీ విభాగం అధ్యక్షుడు మాజీద్ నాయకులతో ఆదివారం వేల్పూర్‌లో విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఎన్నికల్లో లబ్ధిపొందడానికి ఇష్టానుసారంగా కుల సంఘాలకు, ఇతర పనులకు శిలాఫలకాలు వేశారని ఆరోపించారు. ప్రజలను మభ్యపెట్టి విజయం సాధించారని, ఇప్పుడు ప్రజలు ఎక్కడ నిలదీస్తారోనని కాంగ్రెస్ ప్రభుత్వం మీద నిందలు వేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ప్రొసిడింగ్‌లు ఇచ్చిన బీఆర్‌ఎస్ వారే పనులు చేయించాల్సి ఉంటుందని అన్నారు.

అపురూప ఆలయంలో స్వామి దర్శనానికి ఏర్పాట్లు



అపురూప వేంకటేశ్వర ఆలయం

మాక్లూర్: మండలంలోని అడవిమామిడిపల్లి శివారులో ఉన్న అపురూప వేంకటేశ్వర ఆలయం నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం తెల్లవారు జామునుంచే భక్తులతో కిటకిటలాడనుంది. 63వ నంబర్ జాతీయ రహదారికి అతి సమీపంలోనే ఉండటంతో భక్తులు వందలాదిగా తరలివస్తారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేశారు. ఆర్మూర్, మాక్లూర్, నందిపేట్, ఆలూర్, నిజామాబాద్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి వేంకటేశ్వరస్వామిని దర్శించుకోనున్నారు.

మహిళా మత్స్య పారిశ్రామిక సంఘం ప్రారంభం



మోర్తాడ్: మహిళలు ఇంటికే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో రాణించాలని మోర్తాడ్ సర్పంచ్ భోగ ధరణి అన్నారు. మహిళా మత్స్య పారిశ్రామిక సంఘాన్ని ఆదివారం ఆమె ప్రారంభించారు. సంఘం ఆధ్వర్యంలో చేపల విక్రయం, చేపలతో పచ్చళ్ల తయారీ, వివాహాలు, ఇతర శుభకార్యాలకు చేపల వేపుడును తయారు చేసివ్వడం జరుగుతుందని, ఇది మంచి పరిణామమని ఆమె అన్నారు. గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ జైడి చిన్న గంగారెడ్డి, గంగపుత్ర సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – బద్మాష్ గాళ్లకు..(తెలుగు) -12.25
హాయ్‌నాన్న(తెలుగు)- 3.15
ఉమాపతి(తెలుగు)- 6.30, డంకీ (హిందీ)- 10.00
స్క్రీన్-2 – సలార్ (తెలుగు)- 11.00, 2.35, 6.10, 9.45
స్క్రీన్-3 – డెవిల్(తెలుగు) - 12.00, 3.10, 6.20, 9.30
స్క్రీన్-4 – సలార్ (తెలుగు) - 12.15, 10.10
బాబుల్‌గమ్ - 3.50, 7.00

వైభవంగా శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు

రుద్రూర్: మండలంలోని అక్బర్‌నగర్‌లో అయోధ్య శ్రీరాముని అక్షింత శోభాయాత్రను ఆదివారం వైభవంగా నిర్వహించారు. సర్పంచ్ తిగుళ్ల గంగామణిప్రసాద్ ఆధ్వర్యంలో మహిళలు మంగళహారతులతో అక్షింత కలశానికి ఘనస్వాగతం పలికారు. జైశ్రీరాం నినాదాలతో గ్రామం మార్మోగింది. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, శ్రీరామాలయ కమిటీ సభ్యులు, భజన మండలి సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రేపు హెచ్‌డీఎస్ ప్రత్యేక సమావేశం

నవీపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ క్లస్టర్ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)లో హెల్త్ డెవలప్‌మెంట్ సొసైటీ(హెచ్‌డీఎస్) ప్రత్యేక సమావేశాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు ఆస్పత్రి సూపర్‌వైజర్ కిషన్ ఆదివారం తెలిపారు. ఎంపీపీ సంగెం శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశంలో ఆస్పత్రి అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించనున్నట్లు తెలిపారు.

దోమల విజృంభన

- నిరుపయోగంగా ఫాగింగ్ యంత్రాలు
- పట్టించుకోని అధికారులు
- రోగాల బారిన పడుతున్న పట్టణవాసులు



నిరుపయోగంగా ఉన్న ఫాగింగ్ యంత్రం



జనావాసాల మధ్య ఉన్న మురికికాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలో దోమల విజృంభిస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ పరిధిలోని 36 వార్డుల్లో పరిస్థితి అధ్వానంగా మారిందని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని పట్టణవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి రోజూ వార్డులో ఫాగింగ్ చేపట్టిన దోమలను నిర్మూలించాల్సి ఉన్నప్పటికీ, ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో పట్టణవాసులు రోగాలబారినపడుతున్నారు. మురికికాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. మురికికాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపర్చి దోమలు వృద్ధిచెందకుండా ఆయిల్ బాల్స్ వేయడంతోపాటు గాంబూసియా చేపలను కాలువల్లో వదలాల్సి ఉన్నప్పటికీ.. ఎటువంటి పనులు చేపట్టడం లేదు. ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న డ్రైడే నామమాత్రంగానే కొనసాగుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఫాగింగ్ యంత్రాలు చెడిపోయి చాలా రోజులు అవుతున్నప్పటికీ.. వాటికి మరమ్మతులు చేయించడం లేదు. ఇటీవలే ఆరు హ్యాండ్ ఫాగింగ్ మిషన్లు తీసుకువచ్చి ట్రయల్ చేశారు. కాగా ఆరు ఫాగింగ్ మిషన్లు సైతం పనిచేయడం లేదు.

దోమలు వృద్ధి చెందకుండా ఇలా చేయాలి..

ఇళ్లలోని పాతకూలర్లు, టైర్లలో, ఇంటి ఆవరణలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు పాటించాలి. ఖాళీ సీసాలు, కొబ్బరి బొండాలను దూరంగా పారవేయాలి. వాటిల్లో నీరు నిల్వ ఉంటే ఈడిస్ దోమ ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంది. అలాగే మున్సిపల్ పరిధిలోని మురికికాలువల్లో పూడికను ఎప్పటికప్పుడు తొలగించాలి.

దోమల నివారణకు చర్యలు చేపడుతాం

పట్టణంలో దోమల నివారణకు చర్యలు చేపడుతాం. త్వరలోనే మున్సిపల్ పరధిలోని 36 వార్డుల్లో ఫాగింగ్ చేస్తాం. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తాం.

– మహేశ్, సానిటరీ ఇన్‌స్పెక్టర్, ఆర్మూర్

నూతన సంవత్సర సందడి

నూతన సంవత్సరానికి స్వాగతం పలికేందుకు పట్టణంలో సందడి నెలకొంది. ఆదివారం పట్టణంలోని బేకరీలు కిటకిటలాడాయి. కొనుగోలుదారులను ఆకర్షించేందుకు బేకరీల నిర్వాహకులు ఆఫర్లను ప్రకటించారు. కేకులు, కూల్‌డ్రింక్స్, చికెన్ విక్రయాలు జోరుగాసాగాయి. – బోధన్‌టౌన్(బోధన్)



ముగిసిన క్రిస్మస్ టోర్నీ

మాక్లూర్: క్రిస్మస్‌ను పురస్కరించుకొని మండలంలోని మెట్టు గ్రామంలో నిర్వహించిన 37వ క్రిస్మస్ టోర్నీ ఆదివారం ముగిసింది. చివరి రోజున నిర్వహించిన క్యారం పోటీలు హోరాహోరీగా సాగాయి. మొత్తం 32మంది విజేతలకు సోమవారం రాత్రి నిర్వహించనున్న కార్యక్రమంలో బహుమతులను ప్రదానం చేస్తామని నిర్వాహకుడు ప్రసాద్ తెలిపారు. పాస్టర్ సల్మాన్‌రాజ్, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

